www.prajasakti.com

# ప్రజాశక్తి

గురువారం 10 నవంబరు 2022

5

పశ్చిమ గోదావరి

## 14న ఉండిలో ఆక్వా రైతుల నిరసన

**ప్రజాశక్తి - పాలకొల్లు**

జగన్ ప్రభుత్వం మూడున్నరేళ్లుగా అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 13న తూర్పుగోదావరి జిల్లా మండపేటలో ధాన్యం రైతులు, 14న ఉండిలో ఆక్వా రైతులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించనున్నట్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆయన బుధవారం తన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, సకాలంలో ధాన్యం సొమ్ము చెల్లింపులు చేయనందుకు నిరసనగా ఉభయగోదావరి జిల్లాల రైతులు మండపేటలో నిరసన తెలుపుతారని చెప్పారు. నాణ్యత లేని సీడ్, ఫీడ్, గిట్టుబాటు ధరలు, విద్యుత్ సబ్సిడీ కోతలకు నిరసనగా ఉండిలో 14న పెద్దఎత్తున నిరసన తెలపనున్నట్లు ప్రకటించారు.

# వ్యర్థం..అనర్థం..!

**కోళ్ల వ్యర్థాలతో కొల్లేరు కలుషితం**
**తక్కువ వ్యవధిలో అధికలాభాలే కారణం**
**హైదరాబాద్ నుంచి కోడి వ్యర్థాల దిగుమతి**
**అర్ధరాత్రి సమయాల్లో దొంగచాటుగా రవాణా**
**అడపాదడపా దాడులతో పోలీసులు సరి**
**రాజకీయ నాయకుల చెరువులకూ ఇదే మేత..!**

చేపల చెరువుల వద్ద కోళ్ల వ్యర్థాలు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

వ్యర్థాలతో కొల్లేరు నిండిపోతుంది.. కోళ్లవ్యర్థాల మాఫియా కబంధహస్తాల్లో చిక్కుకుని కొల్లేరు అభయారణ్యం విలవిల్లాడుతోంది.. ఆరోగ్యప్రదాయినిగా ఉండాల్సిన మత్స్యసంపదను తన స్వలాభం కోసం విషతుల్యం చేస్తోంది. సంప్రదాయ మేతలకు బదులుగా అధిక దిగుబడులు, అధిక లాభాలకు ఆశపడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. కొల్లేరును కోళ్ల వ్యర్థాల మాఫియా కమ్మేసింది. అర్ధరాత్రి సమయాల్లో దొంగచాటుగా ఇతర ప్రాంతాల నుంచి ఐషర్, బొలేరో వంటి వాహనాల్లో దిగుమతులు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా చేపల చెరువుల్లో మేతగా వేస్తున్నారు. దీన్ని అరికట్టాల్సిన యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతూ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఉమ్మడి పశ్చిమ, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో సుమారు 70 వేల ఎకరాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. ఈ కొల్లేరులో, దాని అనుబంధ గ్రామాల్లో చేపల సాగు అధికంగా సాగుతోంది. ఇక్కడ నుంచి ఉత్తరప్రదేశ్, కోల్‌కత, ముంబయి ఇతర ప్రాంతాలకు ప్రతిరోజూ లారీలతో చేపలను ఎగుమతి చేస్తుంటారు. అయితే ఇటీవల కాలంలో చేపల మేత ధరలు పెరగడంతో ప్రత్యామ్నాయం వైపు కొందరు చేపల చెరువుల రైతులు చూస్తున్నారు. దాన్నే అదునుగా భావించిన కోళ్ల వ్యర్థాల మాఫియా రంగంలోకి దిగింది. హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం నుంచి కోళ్ల వ్యర్థాలను ఇక్కడకు తరలించి వాటిని చేపలకు మేతగా దిగుమతి చేస్తున్నారు. ఈ మాంసాహారాన్ని తిని ఎదిగే చేపలను వినియోగిస్తే భవిష్యత్తులో భయంకరమైన రోగాల బారిన పడతారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పెదపాడు, దెందులూరు మండలాల్లోనే..!**

ప్రతిరోజూ అర్ధరాత్రి సమయాల్లో ఐషర్ వ్యాన్‌లలో, బొలేరో వాహనాల్లో పెదపాడు, ఏలూరు, దెందులూరు మండలాల్లోని కొల్లేరు గ్రామాల్లో ఇతర రాష్ట్రాల నుంచి కోళ్ల వ్యర్థాలు వెళ్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. పోలీసుల కదలికలను బట్టి ఈ వాహనాలు రూటు మార్చుకుంటూ ఈ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ హనుమాన్‌జంక్షన్ మీదుగా కొన్ని, పెదకేడు నుంచి పెదపాడులోకి మరికొన్ని, ఉంగ్రాజువరం నుంచి ఇంకొన్ని వాహనాలు ఈ మండలాల్లోని చెరువుల వద్దకు వస్తున్నాయి. మరికొన్ని విజయరాయి మీదుగా ఏలూరు నగరం మీదుగా పోణంగి, మాదేపల్లి సమీప ప్రాంతాల్లోని చెరువులకు వెళ్తున్నాయని పలువురు చెబుతున్నారు. ఈ వాహనాలు రావడానికి అరగంట ముందునుంచి కొందరు యువకులు ద్విచక్రవాహనాల్లో స్థానికంగా తిరుగుతూ పోలీసులు గస్తీ కాస్తున్నారా? లేదా? లేక ఇతర శాఖల అధికారులేమైనా వాహనాలను పట్టుకుంటారేమోనని కాపుకాశారా? అనేదానిపై రెక్కీ నిర్వహిస్తారు. ఆ తర్వాత కార్లలో ఆ వాహనాల ద్వారా వ్యర్థాలను తరలించే మాఫియా ప్రతినిధులు రంగప్రవేశం చేసి తుది రెక్కీ నిర్వహిస్తారు. అంతా పక్కా అనుకున్న తర్వాత వాహనాలను జిల్లాలోకి రానిస్తున్నారు. ఇన్ని చేసినా పోలీసులు అడపాదడపా దాడులు చేసి వాటిని పట్టుకుంటున్నారు.

**తప్పించుకుంటున్నారా..? తప్పిస్తున్నారా..?**

ఈ కోళ్ల వ్యర్థాల తరలింపు ఎంతోకాలం నుంచి కొనసాగుతోంది. అయినప్పటికీ దీన్ని అధికారులు అరికట్టలేకపోవడంపై సర్వత్రా విమర్శలూ, అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఈ మాఫియాకు అధికారుల అండదండలున్నట్లు పలువురు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. కొందరు రాజకీయ నాయకులు కూడా ఈ మాఫియాలో భాగస్వాములయ్యారని, వారి చెరువులకు కూడా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఆయా శాఖల అధికారులకు నెలనెలా మామూళ్లు పంపించడం వల్ల వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. వాస్తవానికి ఈ వ్యర్థాల రాకపోకలను అడ్డుకోవాలంటే అడ్డుకోవచ్చు. చెరువుల వద్దకు వెళ్తే ఎక్కడ వ్యర్థాలు వేస్తున్నారో? ఎక్కడ వేయడం లేదని గుర్తించడం చాలా సులభం.. కానీ అధికారులు ఆ దిశగా ఏనాడూ అడుగులు వేయలేదు. దీన్నిబట్టి వారు ఇందులో భాగస్వాములయ్యారని పలువురు విమర్శించడం గమనార్హం. అతితక్కువ ధరకు ఈ వర్థాలను హైదరాబాదులో కొనుగోలు చేసి ఇక్కడ కిలోల లెక్క చెరువుల యజమానులకు విక్రయించడం వల్ల అధిక లాభాలు వస్తున్నాయి. ఇటీవల పెదపాడు మండలంలో ఈ వ్యర్థాల తరలింపు విషయంలో వివాదం తలెత్తడంతో ఓ యువకుడు కనిపించకుండా పోయాడు. అతడిని ఈ వ్యర్థాల మాఫియా హతమార్చిందని అతని బంధువులు ఆరోపించడం గమనార్హం.

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, జిల్లా అధికారులు

## అర్హులు ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

### కలెక్టర్ పి.ప్రశాంతి

**ప్రజాశక్తి - భీమవరం**

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు చాలా విలువైందని, ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బివి.రాజు కళాశాల ఆవరణలో ఓటుహక్కు నమోదుపై అవగాహనా ర్యాలీని ఆమె ప్రారంభించారు. బివి.రాజు కళాశాల మెయిన్ గేటు వద్ద నుండి బివి.రాజు విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రతి పౌరుడికీ కీలకమమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని కోరారు. 2023 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తయ్యేవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన యువత నమోదు చేసుకున్న అనంతరం వారికి ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఐపిఐసి)ను జారీ చేస్తారని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో అతిపెద్ద పాత్ర ఓటర్లదేనని, బాధ్యత గల ప్రతి పౌరుడూ విధిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. యువత నిరక్షరాస్యులకు అవగాహన కల్పించి ఓటుహక్కు వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. ఓటు హక్కు నమోదు చేసుకోవడమే కాకుండా ఎన్నికలలో ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు చాలా ముఖ్యమైందని ఎన్నికల్లో గెలుపొందిన ప్రభుత్వాలు సంక్షేమ, అభివృద్ధి, ఉపాధి రంగాలు అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. అందరూ ఓటుహక్కును విధిగా నమోదు చేసుకుని ఓటుహక్కు ప్రాధాన్యతను తల్లిదండ్రులకు, సమీప ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఓటుహక్కు నమోదుకు ఆన్‌లైన్ ద్వారాగాని, ఫారం-6 ద్వారాగాని నమోదు చేసుకోవచ్చని దాసి రాజు అన్నారు. బివి.రాజు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్వీప్ లోగోను కలెక్టర్ పరిశీలించారు. బివి.రాజు కళాశాలలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మూడు ఓటరు నమోదు కేంద్రాలను కలెక్టర్ ప్రారంభించారు. అక్కడున్న సిబ్బందిని ఓటర్లు ఓటును ఎలా నమోదు చేస్తున్నారో వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఇఒ ఆర్‌వి.రమణ, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, తహశీల్దార్ వై.రవికుమార్, బివి.రాజు కళాశాల ప్రిన్సిపల్ ఐఆర్‌కె.రాజు, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరాజు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పేరెంట్స్ కమిటీలను చైతన్యపర్చాలి**

విద్యాశాఖలో జరిగే అన్ని కార్యక్రమాలు పూర్తిస్థాయిలో తెలుసుకుని వాటిని సక్రమంగా జరిగేలా పర్యవేక్షించేటట్లు పేరెంట్స్ కమిటీలను మోటివేట్ చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం బివి.రాజు కళాశాల ఆడిటోరియంలో ఎంఇఒలు, డిఆర్‌డిఎ, ఎపిఎంలకు విద్యాశాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై ఒకరోజు శిక్షణను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేలా ఎపిఎంలు పని చేయాలని సూచించారు. ఈ శిక్షణను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని విద్యాశాఖలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నాడు-నేడు పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. స్కూళ్లల్లో జరిగే అన్ని కార్యక్రమాలను ఎపిఎంలు పరిశీలించాలన్నారు. విద్యార్థులు డ్రాప్‌వుట్ కాకుండా వారిని, వారి తల్లిదండ్రులను చైతన్యపర్చాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు, డిఇఒ ఆర్.వెంకటరమణ, సమగ్ర శిక్షాభియాన్ ఎపిసీ శ్యామ్‌సుందర్, ఎంఇఒలు, ఎపిఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు

## సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - నరసాపురం టౌన్**

త్వరలో నియోజకవర్గంలో జరిగే సిఎం పర్యటనను విజయవంతం చేయాలని ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాద్‌రాజు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డ్వాక్రా, మెప్మా సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సిఎం సభకు డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ వైవి.వేణుగోపాల్, అడిషనల్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీటలు తీసిన భవనాన్ని పరిశీలిస్తున్న నేతలు

## రజక విశ్రాంతి భవనాలకు నిధులివ్వాలి

**కాళ్ల:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శిథిలమైన రజక విశ్రాంతి భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. మండలంలోని పెదఅమిరంలో శిథిలావస్థలో ఉన్న రజక విశ్రాంతి భవనాన్ని, రజకుల చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేస్తున్న 111 జిఒ ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ఒక్కో రజక విశ్రాంతి భవనానికి రూ.మూడు లక్షలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో యండమూరి ప్రసాద్, బొండాడ యాకోబు, పెనుగుర్తి సింహాచలం, మహంకాళి, అప్పన్న, సత్యవతి, మేరీ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ టన్నెల్ నిర్మించండి

### ఎంపీ రఘురామకృష్ణంరాజుకు సిపిఎం వినతి

**ఆకివీడు:** స్థానిక 14వ వార్డు జవహర్‌పేట వద్ద దుంపగడప వెళ్లే రోడ్డులో రైల్వే గేటు వద్ద అండర్ టన్నెల్ నిర్మించాలని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు సిపిఎం నాయకులు వినతిపత్రం పంపారు. ఈ మేరకు బుధవారం సిపిఎం పట్టణ ప్రతినిధిబృందం భీమవరంలోని ఎంపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు తెలిపారు. నరసాపురం-విజయవాడ రైల్వేలైన్ డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తవ్వడంతో రైళ్ల రాకపోకలు పెరిగాయని, దీంతో తరచూ రైల్వే గేటు మూసేస్తున్నారని తెలిపారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఎంపీ చొరవ చేసి నిధులు మంజూరు చేసి అండర్ టన్నెల్ నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో తవిటినాయుడుతోపాటు పెంకె అప్పారావు, బొడ్డుపల్లి రాంబాబు, డోకల రవితేజ, గేదెల ధనుష్ పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణంలో రోజువారీ ప్రగతి కన్పించాలి

### హౌసింగ్ ఇఇ రమణ

**ప్రజాశక్తి - పాలకోడేరు**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణంలో రోజువారీ ప్రగతి కన్పించాలని గృహనిర్మాణశాఖ ఇఇ బివి.రమణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులతో గృహనిర్మాణ ప్రగతిపై బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మండలంలో 2,435 ఇళ్లు మంజూరవ్వగా 1250 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటన్నింటినీ త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీగంగాధరరావు, హౌసింగ్ ఎఇ నర్సింహారావు, ఆర్ఐ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శులు శ్యామ్‌కుమార్, లక్ష్మి, రాజేష్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి : ఎపి రైతుసంఘం

**ప్రజాశక్తి - ఆచంట**

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, మండల కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇరువురు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పినట్లుగా వాలంటీర్ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు. నియోజకవర్గంలో ఇప్పటికే సార్వా కోతలు ప్రారంభమైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. 80 శాతం ఇ-క్రాప్ నమోదైనట్లు అధికారులు చెబుతున్నారని, మిగిలిన 20 శాతం కూడా పూర్తి చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆర్‌బికె కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్లకు, వ్యవసాయ సిబ్బందికి, వాలంటీర్లకు అవగాహన కల్పించాలని కోరారు. రబీ సాగుకు నారుమడులు వేసుకునేందుకు పంట కాలువలు ఆధునికీకరణ చేయాలని, విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు.

## ఆక్వా ల్యాబ్ అసిస్టెంట్లకు కొనసాగిన శిక్షణ

**ప్రజాశక్తి - ఉండి**

ఆక్వా రంగంలో వ్యాధుల నిర్ధారణ, నివారణకు సంబంధించి ఉండి మత్స్య పరిశోధనా కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్త టి.నీరజరెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ల్యాబ్ అసిస్టెంట్లకు రొయ్యలకు సోకే వైరస్ వ్యాధుల నిర్ధారణకు నిర్వహించే పిసిఆర్ పరీక్షను ప్రయోగాత్మకంగా వివరించారు. ఆక్వా సాగులో నీటి నాణ్యత, మట్టి నాణ్యత, వ్యాధుల నిర్ధారణ మొదలైన అంశాలపై పిపిటిల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త ఎ.శ్రీనివాసరావు, ఏరీస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ ఏరియా మేనేజర్ శ్రీనివాసరావు, టెక్నికల్ ఆఫీసర్ రాజేష్ పాల్గొన్నారు.



ల్యాబ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

## నెల రోజుల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు పైపులైన్‌కు అనుసంధానం

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పట్టణంలో నిర్మాణంలో ఉన్న రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను నెల రోజుల్లో పైపులైన్‌కు అనుసంధానం చేస్తామని, దీంతో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తదని పబ్లిక్ హెల్త్ ఎస్ఇ ఎ.సుధాకర్ చెప్పారు. బుధవారం ఆయన పట్టణంలో నిర్మాణంలో ఉన్న రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న మున్సిపల్ అతిథి గృహం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. జిల్లాలోని మున్సిపాల్టీల్లో తడి, పొడి చెత్తను వేరు చేయడం వల్ల మున్సిపాల్టీలు సుందరంగా ఉన్నాయని చెప్పారు. విజ్జేశ్వరం నుంచి జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలకు తాగునీరు నేరుగా వచ్చేలా ప్రాజెక్టు త్వరలో కార్యరూపం దాల్చుతుందన్నారు. జిల్లాలో ఆక్వా వల్ల తాగునీరు కలుషితమవుతోందని, అందుకే ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీర్ సాంబశివుడు, ఎఇఇ సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎస్ఇ సుధాకర్, అధికారులు

## టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు ఇవ్వాలి

### మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

**ప్రజాశక్తి - తణుకు**

టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలని తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని కోరుతూ బుధవారం పట్టణంలోని కోర్టు ఎదురుగా టిడిపి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు ఇళ్లు అందించలేదని విమర్శించారు. పట్టణంలో జి-ప్లస్ విధానంలో 914 ఇళ్లు 70 శాతం నిర్మించారని, చివరి దశలో ఉన్న ఇళ్లను పేదలకు అందించకుండా వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని చెప్పారు. లబ్ధిదారులు అప్పు చేసి రూ.50 వేలు ప్రభుత్వానికి కట్టారని, వాటికి వడ్డీలు కట్టలేక, అద్దె ఇళ్లలో ఉండలేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎంఎల్ఎ, మంత్రి కారుమూరి కళ్లు తెరిచి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ముళ్లపూడి వెంకటకృష్ణారావు, టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పరిమి వెంకన్నబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్లు తోట సూర్యనారాయణ, బసవ రామకృష్ణ, చుక్కా సాయిబాబా, తేతలి సాయి, తమరాపు రమణమ్మ, తణుకు రేవతి, కె.ఇందిరాదేవి, దూలం చిట్టిపాప పాల్గొన్నారు. నిరసన దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు.

దీక్షలో కూర్చున్న ఆరిమిల్లి రాధాకృష్ణ, టిడిపి నేతలు

## రెండు పూటలా తాగునీరందించడమే లక్ష్యం

### మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

**ప్రజాశక్తి - తణుకురూరల్**

ప్రతి కుటుంబానికీ స్వచ్ఛమైన తాగునీరు రెండు పూటలా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తణుకు మండలం దువ్వలో వాటర్ ట్యాంక్ వద్ద రూ.38.59 కోట్లతో జలజీవన్ మిషన్ పైప్‌లైన్, వాటర్ ట్యాంక్ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్ సెంటర్‌ను, రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ పట్టణాలకు ధీటుగా గ్రామాల అభివీద్ధి ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్క దువ్వ గ్రామంలోనే పైపులైన్లకు రూ.2.15 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన పుంత రోడ్లు వేసి లాభసాటి వ్యవసాయానికి రైతన్నలకు బాసటగా నిలుస్తామన్నారు. ప్రతిరైతూ తమ పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేలా అధికారులు, సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతోపాటు రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మన సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయిస్ డిఎం టి.శివరామప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కారుమూరి

## జెడ్‌పి ఛైర్మన్‌చే ఆర్యపేట సచివాలయం ప్రారంభం

**ప్రజాశక్తి - యలమంచిలి**

మండలంలోని ఆర్యపేటలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఆయన వెంట ఎంపిపి రావూరి వెంకటరమణ, నాయకులు గుణ్ణం నాగబాబు, రాష్ట్ర కార్యదర్శి కుమార దత్తాత్రేయ వర్మ ,మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, వైస్ ఎంపిపి గొల్లపల్లి శ్రీనివాసరావు, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు వల్లబు నరసింహారావు, ఆర్యపేట సర్పంచి మేడిది జ్ఞానమణి, చివటపు నాగేశ్వరరావు, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

## ఎపి నిట్‌లో 716 సీట్లు భర్తీ

### నేటి నుంచి ఓరియంటేషన్ ప్రోగ్రాం

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎపి నిట్)లో బిటెక్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి మొత్తం 716 సీట్లు భర్తీ అయ్యాయని డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య తెలిపారు. బిటెక్‌లో ఎనిమిది కోర్సులు నిర్వహిస్తుండగా మొత్తం 750 సీట్లు ఉన్నాయన్నారు. వీటిలో 50 శాతం (375 సీట్లు) సీట్లను రాష్ట్ర విద్యార్థులతోను, మిగిలిన సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులతోను భర్తీ చేస్తుండగా మొత్తం 716 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని చెప్పారు. వీరిని ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, డాక్టర్ ఎన్.జయరామ్ ప్రత్యేకంగా అభినందించారని వివరించారు.

**నేటి నుంచి ఓరియంటేషన్ ప్రోగ్రాం**

సంస్థలో ప్రవేశాలు పొందిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నామని డీన్ కురుమయ్య తెలిపారు. సంస్థలో నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు ఎలా నడుచుకోవాలి, మార్గదర్శకాలు, లక్ష్యాలను ఎలా నిర్దేశించుకోవాలి, వాటి సాధనకు ఎలా కృషి చేయాలి, నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవాలి వంటి అంశాలతోపాటు సంస్థ వారికి కల్పిస్తున్న సదుపాయాలు, అధునాతన సాంకేతికతపై పట్టు సాధించడం వంటి అంశాలపై అగర్తల ట్రిపుల్ ఐటి పూర్వ డైరెక్టర్ డాక్టర్ పి.ఎస్.అవధాని, అక్షయ పాత్ర ఫౌండేషన్ సభ్యులు, సైకాలజిస్టులు ప్రసంగించనున్నారని వివరించారు.

## విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - తణుకు రూరల్

విద్యార్థినులు విద్యతో పాటు వివిధ ఉపాధి కోర్సుల్లో నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌వేర్ మెథడ్స్ నేర్చుకుంటే విజయం సాధించవచ్చని జిల్లా యూత్ ఆఫీసర్, నెహ్రూ యువకేంద్రం రిసోర్స్‌పర్సన్ దూలం కిషోర్ అన్నారు. స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల, డిగ్రీ, పిజి(అటానమస్)లో కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ విభాగం వారు కళాశాల విద్యార్థినులకు కెరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్‌లో బుధవారం అవగాహనా కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ లక్ష్యసాధనకు కృషి, పట్టుదల, దీక్ష, కఠోరసాధన, అంకితభావం ఉండాలన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం కిషోర్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటసుబ్బారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ యు.లక్ష్మీసుందరీబాయి, కె.పద్మజారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - వీరవాసరం

సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి సక్రమంగా ధాన్యం కొనుగోలు చేయాలని అండలూరు సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ చవాకుల సత్యనారాయణమూర్తి ఆర్‌బికె సిబ్బందికి సూచించారు. సార్వా కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో బుధవారం సహకార సంఘం వద్ద ఆర్‌బికె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కొనుగోలు సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు భరోసా కల్పించాలన్నారు. తూకాల్లో, తేమ శాతం తదితర నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. గతం కంటే భిన్నంగా ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పటిష్టంగా అమలు చేస్తున్నారు. కొనుగోలు చేసే సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం సిఇఒ లింగం శ్రీనివాస్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపికి గుణపాఠం చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి - ఉండి

రైతులపై కక్ష కట్టి వారిని మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల ఎంఎల్‌ఎలు మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు టిడిపి నేతలకు, రైతులకు పిలుపునిచ్చారు. బుధవారం ఉండిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఆక్వా రైతులపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారు. వరి రైతులను సైతం ప్రభుత్వం మోసగిస్తున్నదన్నారు. ధాన్యం అమ్మిన సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. వరి రైతులకు న్యాయం జరిగేలా ధాన్యం కొనుగోలు చేయాలని, సకాలంలో సొమ్ము చెల్లించాలని కోరుతూ ఉభయగోదావరి జిల్లాలోని వరి రైతులకు నవంబర్ 13వ తేదీన మండలాల్లో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని నవంబర్ 14వ తేదీన ఉండి మెయిన్ సెంటర్ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉండి గ్రామ అధ్యక్షులు కమిడెంకి నాగరాజు, పార్టీ మండల అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు పొట్నూరి వెంకటేశ్వరరావు, కట్లా రాంబాబు, నాయకులు కాగిత మహంకాళి, గురుగుబెల్లి వెంకట సత్యనారాయణ, దూసనపూడి రాంబాబు, కిన్నెర వెంకన్న, కొల్లి మూర్తి పాల్గొన్నారు.

## 14 నుంచి అఖిల భారత సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి ఎం.రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ అఖిల భారత జాతీయ సహకార యూనియన్, విజయవాడ రాష్ట్ర సహకార యూనియన్ ఆదేశాల మేరకు జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో 69వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారోత్సవాలు పురస్కరించుకొని ప్రతి సహకార సంఘం కార్యాలయం ఆవరణలో సహకార జెండాను ఎగరవేసి సంఘ అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, సహకారవేత్తలు, రైతులు, మహిళలు, సంఘ సభ్యులతో రోజువారి కార్యక్రమాలకు అనుగుణంగా సమావేశపరచి పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## నాపై ఆరోపణల్లో వాస్తవం లేదు : చాగంటి గణేష్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వేరే ఒకరి భూమిపై ఎంపెడా సర్టిఫికెట్లు సృష్టించి తాను లబ్ధి పొందానని కొంతమంది వ్యక్తులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, అందులో ఎటువంటి వాస్తవం లేదని లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన చాగంటి గణేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావాలనే కొంత మంది వ్యక్తులు ఇబ్బందులకు గురి చేసేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కొంతమంది వ్యక్తులు ఎంపెడా సర్టిఫికెట్ లాగిన్‌లో తన ఫోన్ నెంబర్‌ను ఉపయోగించుకుని ఉండవచ్చని పేర్కొన్నారు. అవాస్తవ ఆరోపణలు చేసే ముందు ఒక సారి ఆలోచించుకోవాలని తెలిపారు.

## గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు

ప్రజాశక్తి - నరసాపురం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంఎల్‌ఎ, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో నవంబర్ 14 నుంచి నిర్వహించే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆయన తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాలలోని పుస్తకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉద్బోధించారు. ఈ వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, పంత శ్రీనాథ్, శాస్త్రవేత్త ఆర్‌వి.సుబ్బారావు, సుధీర్, మోహన్, సూర్యం బాబు, కేసరి పాల్గొన్నారు.

## చింతపర్రులో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చింతపర్రులో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం కార్యక్రమం సర్పంచి గుమ్మళ్ల పెద్దిరాజు బుధవారం ప్రారంభించారు. సచివాలయ పరిధిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో పిహెచ్‌సి వైద్యాధికారి అడ్డాల ప్రతాప్ కుమార్, 104 వాహన వైద్యాధికారి పి.వి.నారాయణ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి నెక్కంటి కృష్ణారావు, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, ఎంఎల్‌హెచ్‌పిలు కృష్ణవేణి, శ్రావణి, సూపర్‌వైజర్ ఎస్.కె.అమలేశ్వర్లు పాల్గొన్నారు.

మొగల్తూరు : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బుధవారం కాళీపట్నం తూర్పు గ్రామంలో నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు దినేష్‌కుమార్ పలువురిని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తణుకుల వెంకటదుర్గ, సురేష్, మేడిది ప్రభాకర్ పాల్గొన్నారు.

## పాలకొల్లులో కార్తీక వనసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎనిమిదో వార్డులోని శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో కనమర్లపూడి చిన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ మేకా శేషుబాబు పాల్గొన్నారు. యాత్రికులతో కలిసి ఆయన సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల వెంకటరమణ, దొమ్మేటి వెంకట్రావు, శంకర్రావు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## క్యాబ్ డ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - కాళ్ల

కోమటిగుంట గ్రామానికి చెందిన క్యాబ్ డ్రైవర్ తూము శ్రీనివాసరావు(34) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీనివాసరావు జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. హైదరాబాద్ నుంచి వచ్చిన శ్రీనివాసరావు బుధవారం సీసలి గ్రామంలో ఆత్మహత్య చేసుకున్నాడు. తూము శ్రీనివాసరావు సోదరుడు తూము మోహన్‌కృష్ణ ఫిర్యాదు మేరకు కాళ్ల ఎస్ఐ రామరాజు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# వెలగలేరులో అపారిశుధ్యం తాండవం

## దోమల వ్యాప్తితో రోగాల బారిన గ్రామస్తులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని వెలగలేరులో అపారిశుధ్యం తాండవం చేయడంతో దోమలు వ్యాప్తి చెంది గ్రామస్తులు పలు వ్యాధుల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ గ్రామస్తులు డెంగీ, టైఫాయిడ్ వంటి వాటి బారిన పడిన ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. సర్పంచి, పంచాయతీ సిబ్బంది గ్రామంలో పారిశుధ్యాన్ని పట్టించుకోవడంలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. రోజురోజుకూ చెత్త పేరుకుపోతున్నా పంచాయతీ వారు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నెలకొన్ని అపారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శి సుధారాణిని వివరణ కోరగా చెత్తాచెదారం పేరుకుపోవడం వాస్తవమని,

ఇళ్ల ఎదుట పేరుకుపోయిన చెత్త

పంచాయతీ విషయాలను సర్పంచి కొవ్వూరి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.

## దళిత సమస్యలపై పోరాటం : కెవిపిఎస్

ప్రజాశక్తి - వీరవాసరం

దళిత సమస్యలపై మరింత పోరాటం పెంచేందుకు ఈ నెల 16, 17 తేదీల్లో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వీరవాసరం మండల ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని జి.శ్యామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల విజయకుమార్ మాట్లాడుతూ బిజెపి మతోన్మాద విధానాలను అమలు చేస్తుందన్నారు. దళితులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయన్నారు. బిజెపి దళితులపై కులవివక్ష దాడులు, హత్యలు చేస్తుందన్నారు. సామాజిక న్యాయం నిర్వీర్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం పేరుతో దళితుల అభివృద్ధిని వెనక్కు లాగుతుందన్నారు. అసలైన సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తుందన్నారు. దళితులకు చెందిన 15 సంక్షేమ పథకాలు నిలిపివేయడం దారుణమన్నారు. అభివృద్ధి అంటే ఆర్థిక చేయూత మాత్రమే కాదని ప్రతి ఇంటికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో చేపట్టే ఉద్యమ ప్రణాళికను రూపొందించుకోవడానికి ఐదో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిధులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో పోతుల మృత్యంజయ పాల్గొన్నారు.

## స్నేహితునికి ఆర్థిక సాయం

వెంకట్రావుకు సాయం అందించిన స్నేహితులు, సర్పంచి

ప్రజాశక్తి - ఆచంట

ఆర్థిక, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తికి తన స్నేహితులు ఆపన్న హస్తం అందించారు. మండలంలోని కొడమంచిలి గ్రామానికి చెందిన సల్లపూడి వెంకట్రావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి పిల్లల స్కూల్ ఫీజుల భారాలు, మరో పక్క అనారోగ్యంతో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో సొంత ఇంటి నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో 1981-1982లో తనతో పాటు పదో తరగతి చదువుకున్న చిలుకూరి శ్రీనివాస్, బాలనాగు సూర్యనారాయణ, బాలనాగ అప్పారావు, గొడలు నాగేశ్వరరావు, కొత్తపల్లి శ్రీనివాస్, పిల్లి జయబాబు, దేవబత్తుల వెంకట్రావు, జి.అప్పారావుతో పలువురు వెంకట్రావుకు ఆర్థిక సాయం అందించారు. ఇంటి స్లాబ్ నిర్మాణానికి సుమారు రూ.రెండు లక్షల ఆర్థిక సాయం అందించారు. బుధవారం కొడమంచిలి పెద్దపేటలో స్లాబ్ పనులు పూర్తి చేయించారు. గ్రామ సర్పంచి సుంకర సీతారామ్ కూడా స్నేహితుల ఆర్థిక సాయానికి తోడుగా ప్రభుత్వ పరంగా ఇంటి నిర్మాణానికి మరో రూ.2 లక్షలు అవసరమైన సాయం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తోటి స్నేహితులను, సర్పంచి సుంకర సీతారామ్‌ను అభినందించారు. తన ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన స్నేహితులకు, సర్పంచి సల్లపూడి వెంకట్రావు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యార్థి దశ నుంచి ప్రతిఒక్కరూ కూడా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉషాలక్ష్మీకుమారి అన్నారు. బివిఆర్ఎం గర్ల్స్ హైస్కూల్లో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉంటే ఇంట్లో, చుట్టుపక్కల జరిగే విషయాలపై, వాటి చట్టాల గురించి తెలియచెప్పి వాటిని నివారించడానికి ఉపయోగపడతాయన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన ర్యాలీలో విద్యార్థులతో పాటు న్యాయమూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.ప్రభాకరశాస్త్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అవగాహనా సదస్సు ముగింపు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇంజినీరింగ్ కళాశాలలో 7, 8, 9 తేదీల్లో బిటెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇస్మాయిల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రెండు రోజుల నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య ఆవశ్యకత, కెరీర్ ప్లానింగ్, ట్రైనింగ్, ఉద్యోగ అవకాశాలు, పరిశోధన సౌకర్యాలు, లైబ్రరీ, ఎఐసిటియు సర్టిఫికేట్ కోర్సులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, రెడ్ రిబ్బన్(?), తదితర అంశాల మీద అవగాహన కల్పించినట్లు తెలిపారు. మూడో రోజు తల్లిదండ్రులతో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల భవిష్యత్‌లో వారి పాత్ర గురించి తల్లిదండ్రులు వ్యక్తపరిచిన సందేహాలను నివృత్తి చేశారు.

## ఓటు హక్కు వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఆకివీడు

సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునేందుకు యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు చెప్పారు. అందుకోసం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. గత నాలుగు రోజులుగా విద్యార్థులకు కళాశాలలో నిర్వహిస్తున్న 21 రోజుల ఇండక్షన్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్స్, స్కిల్, ఓటు హక్కు అంశాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సిహెచ్ఎస్ హరినాథ్ పాల్గొన్నారు.

నరసాపురం : 2023 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ సూచించారు. స్థానిక శ్రీ సూర్య కళాశాలలో బుధవారం నిర్వహించిన సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (ఎస్‌విఇఇపి)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సూర్య కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం.సూర్యతేజ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. తహశీల్దార్ ఫాజిల్ మాట్లాడుతూ ఈ ఓటు నమోదు ప్రక్రియకు సంబంధించి ప్రత్యేకమైన విభాగం సూర్య కళాశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు.

# అందుబాటులో ఉండని పిహెచ్‌సి వైద్యులు

## ఇబ్బందుల్లో రోగులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రోగులకు వైద్య సేవలందించాల్సిన ప్రభుత్వ వైద్యుడు వారికి అందుబాటులో ఉండడంలేదు. విధుల నిర్వహణ సమయంలో తన సొంత పనులు చూసుకుంటున్నారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల

తాళం వేసి ఉన్న వైద్యుని గది

పరిధిలోని మార్టేరు పిహెచ్‌సి డాక్టర్ కె.కార్తీక్ ప్రతిరోజు ఉదయం ఆసుపత్రికి వచ్చిన కొంతసేపటికే తన వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లిపోతున్నారని రోగులు చెబుతున్నారు. దీంతో రోగులు వైద్యుని కోసం వేచి చూస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఇప్పటికే స్థానికులు, ప్రజా ప్రతినిధులు విమర్శలు చేస్తున్నారు. పిహెచ్‌సికి ఎప్పుడూ వెళ్లినా వైద్యులు అందుబాటులో ఉండడంలేదని స్థానికులు అతని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా పలువురు రోగులు పిహెచ్‌సికి వెళ్లగా వైద్యులు కార్తీక్ అక్కడ లేరు. సిబ్బందిని అడగగా బయటకు వెళ్లారని సమాధానం చెప్పారు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు ఆవేదన చెందుతున్నారు. కార్తీక్‌కి తోటి వైద్యులు పలుమార్లు చెప్పినప్పటికీ అతని వ్యవహార శైలి మార్చుకోవడంలేదని చెబుతున్నారు.

# ఆదాయం కోల్పోతున్న పంచాయతీ

## చేపల చెరువులకు వేయని టెండర్లు

గ్రామంలోని చేపల చెరువు

పెనుగొండ : మండలంలోని ములపర్రు పంచాయతీలో చేపల చెరువులు పాటలు వేయకపోవడంతో పంచాయతీకి ఏడాదికి రూ.4 లక్షల చొప్పున నష్టం వాటిల్లుతోందని గ్రామస్తులు ఆవేదన చెందు తున్నారు. చేపల చెరువులను మూడేళ్లుగా టెండర్ వేయడంలేదని చెబుతున్నారు. టెండర్లు వేయాలని పలుమార్లు అధికారులను కోరినా స్పందించడంలేదని ప్రజలు వాపోతున్నారు. పన్నులు వసూలు చేయడంలేదని చెబుతున్నారు. పలు సమస్యలతో సతమతమవుతున్న పరిష్కరించేందుకు గ్రేడ్ వన్ సెక్రటరీ లేరని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

**పూర్తి బాధ్యతలు అప్పగించలేదు**

**ఇన్‌ఛార్జి కార్యదర్శి శ్యామల**

ముల్లపర్రు పంచాయతీలో మూడు నెలల నుంచి ఇన్‌ఛార్జి సెక్రటరీగా బాధ్యతలు చూస్తున్నాను. పూర్తి బాధ్యతలు అప్పగించలేదు. చెరువుల పాట్ల పెట్టకపోవడం కారణం తెలియదు.

# అభివృద్ధి బాటలో ములపర్రు సొసైటీ

## ఛైర్‌పర్సన్ వేండ్ర మంగాదేవి

ప్రజాశక్తి - పెనుగొండ

ములపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఛైర్‌పర్సన్ వేండ్ర మంగాదేవి అన్నారు. బుధవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ఛైర్‌పర్సన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి బ్యాంకును అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. గత పాలకులు సొసైటీని నష్టాల్లో నడిపించారన్నారు. తాను పదవిలో కొనసాగుతూ కౌలు రైతులకు రుణాలు, ఎస్‌సి, బిసిలకు మైనార్టీ క్రాప్ రుణాలు అందిస్తూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. రబీ సీజన్‌కు ఎరువులు సొసైటీ ద్వారా రైతులకు అందిస్తామని తెలిపారు. గతంలో పాలకులు లైసెన్స్ రద్దు చేశారని,

మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ మంగాదేవి

మళ్లీ ఎరువులు మందులు విక్రయించేందుకు లైసెన్సును పునరుద్ధరిస్తామని చెప్పారు. రైతులు తీసుకున్న రుణాలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారని, రైతులకు నిత్యం రుణాలు ఇవ్వడంలో అందుబాటులో ఉంటామని ఛైర్‌పర్సన్ తెలిపారు.

## నేడు సంచార జాతుల అభివృద్ధి సంక్షేమ బోర్డు సభ్యుల రాక

భీమవరం : కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వశాఖ విముక్తి సంచార, సెమీ సంచార జాతుల అభివద్ధి సంక్షేమ బోర్డు సభ్యులు తురక నరసింహ గురువారం భీమవరం రానున్నట్లు జిల్లా సమాచార శాఖ బుధవారం ఓ ప్రకటన పేర్కొంది. రాష్ట్రంలో సంచార జాతులు, విముక్తి కులాలకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించనున్నట్లు తెలిపింది.

## రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భీమవరంలోని బ్రౌనింగ్ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 19 బాల బాలికల విభాగాల్లో నెట్ బాల్, రోప్ స్కిప్పింగ్, షూటింగ్, ఆర్చరీ, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, మాల్కంబ్ క్రీడల్లో ఎంపికలు నిర్వహించినట్లు

పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కళాశాల ప్రిన్సిపల్ రంప ఎలిషా బుధవారం తెలిపారు. ఈ క్రీడల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని 73 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ 19 కార్యదర్శులు కె.జయరాజ్, కుమార్ తెలిపారు. ఈ క్రీడల ఎంపికల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా బ్రౌనింగ్ విద్యా సంస్థల ఛైర్మన్ మేడిది జాన్సన్, సెక్రటరీ మేడిది ఎస్తేర్ ప్రియాంక హాజరయ్యారు. బ్రౌనింగ్ కళాశాల యాజమాన్యం క్రీడాకారులందరికి భోజనం వసతి ఏర్పాట్లు చేసిందని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీడీ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాణిక్యం రాజా, రాష్ట్ర నెట్ బాల్ సంఘ వైస్ ప్రెసిడెంట్ ఎన్.విజయలక్ష్మి, రాష్ట్ర ఫెన్సింగ్ సెక్రటరీ కృష్ణమోహన్, ఆర్చరీ షూటింగ్ కోచ్ సుభాన్, పీడీలు నాగమణి, బ్రౌనింగ్ విద్యా సంస్థల సంస్థల వైస్ ప్రెసిడెంట్ అబ్రహం, రాష్ట్ర రూప్ స్కిప్పింగ్ సెక్రటరీ శేఖర్ రాజు, డిఎన్ఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ డి.గ్రీస్ డేనియల్, బ్రౌనింగ్ కళాశాల పీడీ సాయి దావుద్ పాల్గొన్నారు.

## అగ్రహారంలో పలు అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - ఉండి

గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు కోరారు. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామపంచాయతీ పరిధిలోని శాంతినగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న కొత్త గ్రావెల్ రహదారులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి కనకదుర్గ మాట్లాడుతూ ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ పరిధిలోని అనేక ప్రాంతాల్లో గ్రావెల్ రహదారులు వేసినట్లు తెలిపారు. గ్రామంలో మంచినీటి సమస్య, రహదారులు, శ్మశానవాటిక అభివృద్ధి చేసినట్లు తెలిపారు. శాంతినగర్‌లోని రహదారులను కూడా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జెవిటి నాయుడు, పంచాయతీ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

నాడు నేడులో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కొత్తట, కొత్తకాయలతిప్ప గ్రామాల్లో ఆమె బుధవారం పర్యటించి పాఠశాల అభివృద్ధి పనులను, లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు నేడు ఫేజ్-2లో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## శశి కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లీగల్ సర్వీస్ డే సందర్భంగా బుధవారం శశి ఇంజినీరింగ్ కళాశాలలో తాడేపల్లిగూడెం మండల న్యాయ సహకార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాది శిరిగినీడి విజయకృష్ణ, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.


గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

## గర్భిణులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

గర్భిణులకు పిహెచ్‌సిల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సిహెచ్ వి రంగం నాయుడు తెలిపారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటసుబ్బారావు మృతి బాధాకరం : టిడిపి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గ వాణిజ్య విభాగ కార్యదర్శి, ఆర్యవైశ్య నాయకులు అమర వెంకటసుబ్బారావు (60) బుధవారం మృతి చెందారు. ఇటీవల ఆయన బాత్రూంలో కాలు జారిపడి గత వారం రోజుల నుండి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, టౌన్ కన్వీనర్ వి.శ్రీనివాస్, నియోజకవర్గ వాణిజ్యవిభాగ అధ్యక్షులు మండవల్లి ఈశ్వర్, నాయకులు వెంకటసుబ్బారావు మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాట్లాడుతున్న సత్యదేవి

## విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు చెడువైపు కన్నెత్తి చూడవద్దని సొసైటీకి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని లీగల్ అథారిటీ ఛైర్‌పర్సన్, థర్డ్ అడిషనల్ జిల్లా జడ్జి పి.శ్రీసత్యదేవి విద్యార్థులకు సూచించారు. బుధవారం నేషనల్ లీగల్ సర్వీసెస్ డే సందర్భంగా భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో లీగల్ సర్వీస్ డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సత్యశ్రీదేవి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, భీమవరం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.న్యూటన్, ఆర్‌డిఒ డి.రాజు, ఎస్ఆర్‌కెఆర్.ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణచైతన్య, సిఎస్‌వి హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**వేలం ప్రకటన**

**మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో**

**ఇ.పి.నెం.23/2019 ఇన్ ఓ.ఎస్.నెం.47/2015**

బిట్వీన్:
చెల్లూరి వెంకట రమేష్ అనే రమేష్ ...డి. హెచ్. ఆర్
మరియు
యడ్డపల్లి లీలావతి ...జె.డి.ఆర్

పై జె.డి.ఆర్. తాలూకు యీదిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని డి.హెచ్.ఆర్. తాలూకు డిక్రీ బాకీ నిమిత్తము మరియు ఖర్చులు దర్మిలా వడ్డి రాబట్టుకొను నిమిత్తము దిగువ షెడ్యూలు ఆస్తిని **ది.25-11-2022 తేదీ ఉదయం 10:30 ని॥ల లగాయితు పై కోర్టులో వేలం జరుగును.** ఆసక్తి గలవారు వేలము షరతులకు లోబడి పాడుకొనవచ్చును.

**SCHEDULE**

West Godavari District, Tadepalligudem Sub division, Tadepalligudem Mandal, Metta upparagudem village hamlet of Kunchanapalli village, bearing R.S.No. 37/1 Total extent of Ac.2-54 cents in which easternside Ac. 1-54 cents in which easternside Ac. 0.52 cents in which easternside south side 5515 square links i.e. 267 square yards or 223.24square meters are bounded by:

***Item-I:*** ***East:*** Gorinta Venkata Siva Ramaraju land 6 links, ***South:*** Gorinta Venkata Siva Ramaraju land 60 links. ***West:*** 4 yards width road 6 links, ***North:*** Item-II - 63 links.

With in the above boundaries the above site is an extent of 349 square links or 18 square yards site with all easement rights.

***Item-II:*** ***East:*** Gorinta Venkata Siva Ramaraju land 75 links, ***South:*** Item-1 63 links. ***West:*** 4 yards width road 71 links, ***North:*** Vendors remaining land 63 links.

With in the above boundaries the above site is an extent of 5149 square links i.e. 249 square yards of vacant site as such Item-I and Item-II schedule properties total extent of site is comes to 267 square yards of vacant site with all easement riths etc.,

***DHR's Value : Rs.3,00,000/-***
***Amin Value : Rs.5,90,000/-***

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులకు లోబడి)

**Sd/- PEDAGADI H.V.N.S.BHUPAL**
Advocate,
Tadepalligudem.
Cell: 98497 93138

Tadepalligudem,
05-11-22.